సాక్షి ప్రకాశం

శనివారం । 5 । ఆగస్టు । 2023



కవాతుతో నాయకత్వ లక్షణాలు

కవాతుతో పోలీసుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఒంగోలులో పోలీస్ పరేడ్‌ను ఆమె తిలకించారు. - 8లో..



డ్రాపౌట్స్ లేకుండా చేయడమే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే లక్ష్యమని ఆర్జేడీ సుబ్బారావు అన్నారు. మార్కాపురంలో ఆయన మాట్లాడారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

న్యాయమూర్తుల నివాస గృహాలు ప్రారంభం రేపు

- రానున్న హైకోర్టు జడ్జిలు

మార్కాపురం: మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయస్థానంలో నూతనంగా నిర్మించిన ఆరో అదనపు జడ్జి నివాస సముదాయాన్ని ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే శ్రీనివాస్ తెలిపారు. హైకోర్టు జడ్జిలు కే మన్మధరావు, జీ రామకృష్ణప్రసాద్, ఏవీ రవీంద్రబాబు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ భారతి, తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

అత్యవసర విమాన ల్యాండింగ్ సౌకర్యాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: అత్యవసర విమాన ల్యాండింగ్ సౌకర్యాల పూర్తి–పెంపుదలపై ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రకృతి వైపరీత్యాలు, ఆకస్మిక పరిస్థితులు సంభవించినపుడు అత్యవసరంగా హైవేలపై విమానాలు దిగేందుకు చేపట్టిన ప్రాజెక్టుల పెంపుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం దేశంలో 17 ప్రాజెక్టులు చేపట్టగా అందులో ఆంధ్రప్రదేశ్‌లో చిలకలూరిపేట–నెల్లూరు సెక్షన్‌లో జాతీయ రహదారి 16పై సింగరాయకొండ, రేణంగివరం వద్ద రెండు నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్టు పనుల కాంట్రాక్టును జాతీయ రహదారుల అథారిటీ విభాగం కేఎంసీ కనస్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చిందని, 2012–2021 నాటికి అగ్రిమెంట్ ప్రకారం అవకాశం మేరకు పనులు పూర్తిచేసిందన్నారు. మిగిలిన పనులు, రోడ్లు, కాలువలు, రిటర్న్ గోడలు, రక్షణ పనులు మైనర్‌బెండ్స్ (చిన్న వంకలు), కర్వ్(మలుపు)లను పూర్తిచేసేందుకు భూసేకరణ, వినియోగ స్థలాల మార్పు వంటి సమస్యలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. కోవిడ్, అనూహ్య వర్షాలు, వరదల ముంపు, భూసేకరణ స్థలాల మార్పు వంటి సమస్యల వల్ల ఈ ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయన్నారు. అన్ని సమస్యలను పరిష్కరించడంతోబాటు నిధుల మంజూరుకు కూడా సత్వర చర్యలు చేపట్టి వీటిని త్వరగా పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి వివరించారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- మేయర్ గంగాడ సుజాత



సీసీ డ్రైన్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మేయర్ గంగాడ సుజాత తెలిపారు. నగరంలోని 9వ డివిజన్ రాజీవ్‌కాలనీలో రూ.23.70 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, నాయకులు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సూపర్ సిక్స్..

- జిల్లాలో మొత్తం 4,63,918 వినతులు
- వాటిలో పరిష్కారం చేసినవి 4,61,521
- వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రజా అవసరాల గుర్తింపు
- ప్రత్యేక క్యాంపుల ద్వారా ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా సేవలు
- 7,70,325 ఇళ్లకు సేవలు ప్రజలకు అందజేత
- జిల్లాలో అత్యధికంగా ఒంగోలు డివిజన్‌లో 1,84,204 మందికి సేవలు
- అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేసి మరీ సంక్షేమం అందజేత

ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. అన్ని అర్హతలు ఉండి చిన్నపాటి కారణాలతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారిని గుర్తించి వారికి సత్వరం ఫలితాలు అందేలా చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. జిల్లాలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి 99.52 శాతం ఫలితాలను సాధించారు. రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచారు.



ఒంగోలు: జగనన్న సురక్ష కార్యక్రమంలో హెల్ప్ డెస్క్

ఒంగోలు అర్బన్:

గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు చేరువ చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. అన్ని అర్హత ఉండి పథకాలు అందని వారికి కూడా మేలు చేసేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయిల్లో జల్లెడపట్టి మరీ అర్హులకు పథకాలు, ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. అర్హత ఉన్నా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేక పథకాలు అందని వారిని గుర్తించారు. వారికి అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను అప్పటికప్పుడే అందించారు. తొలుత వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలో ఉన్న కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాల అందాయా లేదా వివరాలతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు కావాల్సిన వారిని గుర్తించి వివరాలు సేకరించారు. ఆ వివరాలను సచివాలయాల్లో అందచేసి ఆ పనికి సంబంధించి ఒక టోకెన్‌ను దరఖాస్తుదారులకు అందజేశారు. ఆ తర్వాత జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సచివాలయాలు, క్లస్టర్ల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజలు విన్నవించుకున్న ప్రభుత్వ సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా అందించారు. ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచేలా పారదర్శక సేవలు అందించారు. కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు వివాహ ధ్రువీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ కరక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ మొబైల్ లింక్, రైస్‌కార్డులు, సీసీఆర్‌సీ, హౌస్‌హోల్డ్‌తో కలిపి మొత్తం 11 రకాల పత్రాలను అందించారు. జిల్లాలో జూలై నెలలో నిర్వహించిన సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన వినతుల్లో 99.52 శాతం సేవలు ప్రజలకు అందించడంతో రాష్ట్రంలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 719 సచివాలయాల పరిధిలో 4,63,919 వినతులు వచ్చాయి. వాటిలో 4,61,521 వాటిని పరిష్కరించి ప్రజలకు సేవలందించారు. వీటిలో ఒంగోలు డివిజన్‌లో 1,84,204, మార్కాపురం డివిజన్‌లో 1,65,000, కనిగిరి డివిజన్‌లో 1,14,715 సేవలను అందజేశారు. వలంటీర్లు జిల్లాలోని 7,70,325 ఇళ్లకు తిరిగి వినతులు స్వీకరిస్తే వాటిలో 6,71,098 ఇళ్లకు సంబంధించిన ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా చేశారు. చిన్నపిల్లలకు ఆధార్ నమోదు గతంలో 25 శాతం ఉంటే సురక్ష పథకం ద్వారా దాన్ని 50 శాతానికి పెంచారు. జగనన్న సురక్ష పథకం ద్వారా సర్టిఫికెట్లు పొందిన ప్రజల నుంచి వివిధ సంక్షేమ పథకాల కోసం 45,443 దరఖాస్తులు అధికారులకు చేరాయి. ఆ దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 15వ తేదీ లోపు అర్హులకు ప్రయోజనం కల్పించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తోంది. సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్ల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాం. సాధారణంగా సంవత్సరాల పాటు జరిగే పనులు ఒక్క నెలలో లక్షల మంది ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్‌లు మంజూరు చేసి ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుంది. సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్‌లు పొందిన ప్రజలు పథకాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. వాటిని ఆగస్టు 15లోపు పరిశీలించి మేలుచేసేలా ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. జగనన్న సురక్ష పథకం అమలులో జిల్లా 6వ స్థానంలో నిలిచింది.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

రైతు భరోసా వర్తిస్తుంది



ఇతని పేరు చిట్యాల పవన్ కళ్యాణ్‌రెడ్డి, యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు గ్రామం. రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. జగనన్న సురక్ష క్యాంపులో పంటసాగు హక్కు పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. వలంటీరు ఇంటికి వచ్చి రైతుకు అవసరమైన సర్టిఫికెట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అతను కౌలు రైతు కావడంతో పదేళ్ల నుంచి ప్రభుత్వ పరంగా ఎటువంటి పరిహారం పొందలేకపోయాడు. ఎటువంటి ఖర్చు, ఇబ్బంది లేకుండా పంటసాగు పత్రాన్ని వెంటనే అందజేయడంతో తనకు రైతు భరోసా, పంట నష్టపరిహారం, బ్యాంకు రుణం లభిస్తుందని సీఎంకు కృతజ్ఞతలు తెలిపాడు.

పైసా ఖర్చు లేకుండా ఉచితంగా సర్టిఫికెట్



ఈమె పేరు పేరు షేక్ మాభున్నీ. ఈమె కులం, ఆదాయ సర్టిఫికెట్ కోసం మండల కేంద్రంలోని మూడో సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. గ్రామ వలంటీర్ ఇంటికి వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ గురించి వివరాలు తీసుకొని యాప్‌లో నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి ప్రారంభించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎంపీడీఓ ఎస్.విజయ సర్టిఫికెట్లను నయా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందజేశారు. ప్రజల వద్దకే అధికారులను పంపించి సర్టిఫికెట్లను నిమిషాల్లో ఇప్పించడం పట్ల నాగరాజు ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు.



ఒంగోలు: ఇంటికి వెళ్లి కుల ధ్రువీకరణ,ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న వలంటీర్

సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన సీఎం

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం నడిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు లబ్ధి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి వారి అభ్యున్నతికి పాటుపడుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం నడిగడ్డలో గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి సురేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద, మధ్య తరగతి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఎన్నుకున్న మార్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని చెప్పారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ ప్రగతి పథాన సీఎం నడిపిస్తున్నారని అన్నారు. సంక్షేమ అభివృద్ధికి అందరం మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తుంటే తెలుగుదేశం శ్రేణులు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. గతంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ నాయకుల కోసం మాత్రమే పనిచేసిందని గుర్తుచేశారు. నేడు పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని అన్నారు. పథకాలు ఎవరికైనా అందకపోతే తెలియజేయాలన్నారు. నవరత్నాల ద్వారా లబ్ధిదారులందరికీ మేలుచేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. వలంటీర్ల వ్యవస్థపైన విమర్శలు చేయడం సహించరానిదన్నారు. సంక్షేమ ఫలాలు అందలేదంటే వెంటనే లబ్ధిదారులకు అందించేందుకు సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నడిగడ్డ నుంచి గురిజేపల్లి రోడ్డు నిర్మాణం, నడిగడ్డ నుంచి దూపాడు రోడ్డు మరమ్మతు పనులు, ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరగా నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, హనుమాన్ బాబు, ఏఓ కె నీరజ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామసర్పంచ్ వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బీ వెంగళరెడ్డి, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు పద్మజ మల్లికార్జున, స్థానిక నాయకుడు రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఏకేయూ మరో ముందడుగు

- ఈ ఏడాది కౌన్సిలింగ్‌లో 25 పీజీ కోర్సులు
- పేర్నమిట్ట యూనివర్శిటీ భవనం వరకు రోడ్డుకు రూ.1.25 కోట్లు మంజూరు
- ఈనెల 5,7 తేదీల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ మొదటి వార్షిక సమావేశం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డిగ్రీ, పీజీ, లా కాలేజీలకు ఇప్పటికే అఫిలియేషన్
- మీడియా సమావేశంలో ఏకేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ మరో ముందడుగు వేసిందని, అందులో భాగంగా నూతనంగా ఏడు కోర్సులను కలుపుకుని మొత్తం 25 పీజీ కోర్సులతో ఈ ఏడాది కౌన్సిలింగ్‌లోకి అడుగుపెట్టినట్లు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఈ ఏడాది ఫిబ్రవరి 9న బాధ్యతలు స్వీకరించానని, 40 రోజుల్లోపే ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరిధిలో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కాలేజీలను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి బదిలీ చేసుకోగలిగామన్నారు. అందులో డిగ్రీ, పీజీ, లా, ఫార్మసీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలకు గుర్తింపు ఇవ్వడం పూర్తయిందని, ప్రస్తుతం బీఈడీ కాలేజీల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గతంలో కేవలం 17 పీజీ కోర్సులు మాత్రమే విద్యార్థులకు జిల్లాలో అందుబాటులో ఉండేవని, కానీ నేడు వాటిని పాతిక కోర్సులుగా మార్చామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన వాటిలో ఎంఎస్సీలో ఆక్వాకల్చర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు ఎంఏ తెలుగు, ఎంఏ ఆంగ్లం కోర్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా సిలబస్ రూపొందించామని, అయితే ఇది బోర్డు ఆఫ్ స్టడీస్ అప్రూవల్ పొందాల్సి ఉందన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ మొదటి వార్షిక సమావేశం ఈనెల 5, 7 తేదీల్లో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోని పలు యూనివర్శిటీల నుంచి మొత్తం 108 మంది విషయ నిపుణులు హాజరవుతారన్నారు. ఇందుకుగాను పాతిక కోర్సులను 19 బోర్డులుగా విభజించామని, 5వ తేదీ 51 మంది, 7వ తేదీ 57 మంది నిపుణులు సమావేశమై సిలబస్‌ను ఖరారు చేస్తారన్నారు. ఇందుకు అవసరమైన తరగతి గదులను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా హాస్టల్ వసతిని కల్పించేందుకు కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పర్మినెంట్ బోధనా సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందని, అవసరం అయిన గెస్టు లెక్చరర్ల సేవలను కూడా వినియోగించాలని నిర్ణయించామన్నారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కోర్సులు కూడా ప్రారంభించేందుకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అనుమతి తీసుకున్నామని చెప్పారు. ఇందుకు అవసరమైన భవనాలకు డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అదే విధంగా యూనివర్శిటీలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు మన యూనివర్శిటీకి కూడా త్వరలోనే వస్తాయని తెలిపారు. యూనివర్శిటీని త్వరగా పేర్నమిట్ట కొండమీద ప్రారంభించేందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఇప్పటికే పేర్నమిట్టలోని ప్రధాన రహదారి వద్ద నుంచి కొండమీద యూనివర్శిటీ మెయిన్ బిల్డింగ్ వరకు రహదారి నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరుచేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం యూనివర్శిటీకి సంబంధించి అవసరమైన అన్ని విభాగాలను ప్రారంభించామని వెల్లడించారు. పీజీ కోర్సులకు సంబంధించి 17 కోర్సులు యూనివర్శిటీ నేరుగా నిర్వహిస్తుందని, 8 కోర్సులు మాత్రం అఫిలియేటెడ్ కాలేజీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి


పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలి

- పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు

టంగుటూరు: పొగాకు రైతులు సాగుకు ముందు పచ్చిరొట్ట పంటలు తప్పనిసరిగా వేయాలని పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రాన్ని ఆర్‌ఎం లక్ష్మణరావు, ఓఎస్డీ విజిలెన్స్ దామోదర్ శుక్రవారం సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వివిధ గ్రేడులకు గుర్తించిన మార్కెట్ ధరలను పరిశీలించి, సాగుదారులతో మాట్లాడారు. రాబోయే సీజన్లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ వెనుక ఉన్న కారణాలను వివరించారు. రైతులు అధిక ధరలకు బ్యార్నీ, పొలాలు లీజుకు తీసుకోవద్దని హెచ్చరించారు. పొగాకు బోర్డు నియంత్రించిన విస్తీర్ణం, పరిమాణంలో మాత్రమే సాగు చేయాలన్నారు. పొగాకు అక్రమ విక్రయాల్లో పాల్గొనవద్దని సూచించారు. ప్రస్తుత మార్కెటులో ఉన్న పర్యవసానాలని రైతులకు వివరించారు. అలాగే పొగాకు విత్తనాల సరఫరా కందుకూరు సీటీఆర్ఐఎస్ లభ్యత గురించి కూడా పొగాకు సాగుదారులకు వివరించారు. వారి వెంట వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.270

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.270 పలికింది. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన రైతులు 1250 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1206 కొనుగోలు చేశారు. 44 పొగాకు బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.270 కాగా, కనిష్ఠ ధర రూ.160 పలకగా, సరాసరి రూ.260.88 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



టంగుటూరులో వేలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖైదీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

- గుంటూరు రేంజి ఐజీ డా.యంఏ వరప్రసాద్

ఒంగోలు టౌన్: ఖైదీలకు మౌలిక వసతులు కల్పించే విషయంలో అధికారులు తగిన శ్రద్ధ చూపాలని గుంటూరు రేంజి డీఐజీ డా.యం.ఎ. వరప్రసాద్ సూచించారు. ఒంగోలు జిల్లా కారాగారంలో శుక్రవారం గుంటూరు రేంజి అధికారుల సమావేశంలో ఆయన పలు విషయాలను చర్చించారు. గుంటూరు రేంజి పరిధిలోని కారాగారాధికారులు అంతా హాజరయ్యారు. జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి అధికారులను సాదరంగా ఆహ్వానించారు. ఒంగోలు జిల్లా జైలులో ఖైదీల కోసం ఏర్పాటు చేసిన డైనింగ్ హాలును పరిశీలించిన ఆయన వరుణారెడ్డిని అభినందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఐజీ మాట్లాడుతూ... ఒంగోలు తరహాలో గుంటూరు రేంజిలోని అన్నీ జైళ్లలో ఖైదీల కోసం డైనింగ్ హాలు నిర్మించాలని సూచించారు. ఖైదీల సంక్షేమం గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖైదీలతో మాట్లాడిన ఆయన ఉచిత న్యాయ సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఐజీ వరప్రసాద్ జైలు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుంటూరు రేంజి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజి వరప్రసాద్

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీలో 15 నెలల చిన్నారి నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. కాలనీకి చెందిన గండి రోశిబాబు, అలేఖ్యల కు ఇద్దరు కుమార్తెలు. వారిలో 15 నెలల చిన్న కుమార్తెను తల్లి శుక్రవారం బాత్‌రూమ్‌కి తీసుకెళ్లింది. బకెట్ పట్టించి వంట గదిలోకి వెళ్లింది. కొద్దిసేపటికి మళ్లీ బాత్‌రూమ్‌లోకి రాగా పాప బకెట్‌లో తల కిందకు, కాళ్లు పైకి ఉండడంతో ఉలిక్కి పడింది. హడావిడిగా పాపను తీసుకొని చూడగా కొన ఊపిరితో ఉంది. దీంతో పాపను అద్దంకిలో ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశుపోషకులకు అవగాహన కల్పిస్తున్న జేడీ బేబీరాణి

- పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

ఒంగోలు సిటీ: పశుపోషకులు ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి సూచించారు. శుక్రవారం స్థానిక పెళ్లూరులో ఆమె పర్యటించి పశుపోషకులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ పశువులకు గొంతువాపు, జబ్బవాపు మొదలగు వ్యాధి నిరోధక టీకాలను వైద్యుల సూచనల మేరకు పశువులకు వేయించుకోవాలని పశుపోషకులకు సూచించారు. అంతేగాకుండా ఎండుమేత, పచ్చిమేత దాణాకు ప్రత్యామ్నాయంగా 60 శాతం రాయితీపై దాణామృతం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పశుపోషణకు అవసరమయ్యే రుణాన్ని పాడి పశువుల సంఖ్య ఆధారంగా ఒక్కొక్క పాడిరైతుకు కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.1,80,000 వరకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా సంబంధిత బ్యాంకుల నుంచి అతి తక్కువ వడ్డీతో పొంది ఆర్థిక పరిపుష్టి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వై.భూపాల్, పారా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు ఫెన్సింగ్ జిల్లా జూనియర్ జట్ల ఎంపిక

ఒంగోలు: స్థానిక గాంధీ పార్కులో ఆదివారం ఉదయం 8 గంటలకు జిల్లా ఫెన్సింగ్ జూనియర్(అండర్-20) కేటగిరీలో బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2005 జనవరి ఒకటో తేదీ నుంచి 2010 జనవరి ఒకటో తేదీలోపు జన్మించిన బాలబాలికలు అర్హులని స్పష్టం చేశారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నంబర్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ కిట్‌తో పోటీలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8019567778, 7671991147ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ ప్రవేశాల గడువు 7వ తేదీ వరకు..

ఒంగోలు: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీ వరకు గడువు ఉందని ప్రకాశం జిల్లా డిగ్రీ ప్రవేశాల నోడల్ అధికారి డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు సోమవారంలోగా సంబంధిత కాలేజీలో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. ముందుగా ఆన్‌లైన్‌లో అలాట్‌మెంట్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు నాసరురెడ్డి

పెద్దారవీడు: కర్నూలు–గుంటూరు రహదారిని దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని చట్లమిట్ల గ్రామం బస్టాండ్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చట్లమిట్ల గ్రామానికి చెందిన కందుల నాసరురెడ్డి దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన పీర్ల పండుగకు వెళ్లారు. తిరిగి రాత్రి ఆటోలో స్వగ్రామానికి చేరుకున్నారు. అదే సమయంలో హనుమాన్ జంక్షన్ కుంట నుంచి కర్రోల గ్రామానికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి.. చట్లమిట్ల వద్ద రోడ్డు దాటుతున్న నాసరురెడ్డి(50)ని ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



మృతి చెందిన చిరంజీవి

పొదిలి రూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బూచిరాజు చిరంజీవి(35) అనే యువ రైతు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటారు వరకు ఉన్న ఎల్‌టీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్నాడు. స్తంభానికి ఉన్న తీగలు లూజ్ లేకుండా లాగుతున్న తరుణంలో ఒక తీగ తెగి ఆపైన ఉన్న మరో లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి పిలుపులకు వెళ్తూ మృత్యు ఒడిలోకి..



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హుస్సేన్

బల్లికురవ: అన్న కుమారుడి వివాహానికి బంధువులను పిలిచేందుకు బైకుపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనటంతో ఓ వ్యక్తి చనిపోయాడు. ఈఘటన శుక్రవారం నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారిలోని బల్లికురవ మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాతనగర్ కాలనీ వద్ద జరిగింది. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం గ్రామానికి చెందిన షేక్ రని హుస్సేన్ (43) అన్న కుమారుడైన బాజీ వివాహ పిలుపులకు మరో అన్న కుమారుడు షేక్ ముజావర్ ఖాసీం సైదాను వెంట తీసుకుని బైకుపై మేదరమెట్ల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైకును వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న హుస్సేన్ గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యాశాలకు తీసుకెళ్లారు. చికిత్స అందించేలోగా హుస్సేన్ చనిపోయాడు. ఖాసీం సైదా ఫిర్యాదు మేరకు ఏఎస్సై బండి శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

కవాతుతో నాయకత్వ లక్షణాలు

● ఎస్పీ మలికాగర్గ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



కవాతు నిర్వహిస్తున్న ఏఆర్ పోలీసులు

ఒంగోలు టౌన్: పరేడ్, స్పోర్ట్స్‌మీట్లు పోలీసుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం ఆర్మ్ రిజర్వ్‌డ్ సిబ్బంది నిర్వహించిన పరేడ్‌లో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసంగిస్తూ పరేడ్ అనేది పోలీసు సంప్రదాయంలో ఒక భాగమని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న వేడుకల్లో పోలీసులు అద్భుతమైన కవాతు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోలీసు సిబ్బందికి ఏఆర్ విభాగం వెన్నెముక లాంటిదని, ఏదైనా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తినప్పుడు ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకమవుతుందని అన్నారు. సిబ్బంది శారీరక ధృఢత్వం విషయంలో శ్రద్ధ చూపాలని, మంచి అలవాట్లు, వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోలీసు శాఖకు కళంకం తెచ్చే పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బందోబస్తు, ఎస్కార్ట్‌పై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ఏఆర్ సిబ్బంది సమస్యలడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. వృత్తిపరంగా ఏదైనా సమస్యలుంటే ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు వదులుకోవద్దు

● జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి
● వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి అశోక్‌బాబు సూచన



ఉద్యోగార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వరికూటి

సింగరాయకొండ: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో ప్రతి నెలా జాబ్ క్యాలెండర్ ఆధారంగా మెగా జాబ్ మేళాలు ఏర్పాటు చేయిస్తున్నారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం వరికూటి అశోక్‌బాబు సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. అందివచ్చిన ఉద్యోగావకాశాలను వదులుకోవద్దని, కుటుంబ సభ్యులకు భారంగా మారకుండా సొంతగా జీవితంలో పైకెదగాలని నిరుద్యోగ యువతకు ఉద్బోధించారు. ఉద్యోగం చేస్తున్న సంస్థ ఉన్నతికి దోహదపడేలా పనిచేస్తే, వారు మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

15 కార్పొరేట్ కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు 308 మంది హాజరయ్యారు. వీరిలో 132 మంది ఎంపికని చేశారు. 35 మందికి తుది ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. జిల్లా టూరిజం శాఖ అధికారి బెనహర్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి టి.భరద్వాజ్, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, షేక్ సలీంబాషా, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● పాఠశాల విద్య ఆర్జేడీ సుబ్బారావు



మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్కాపురం డివిజన్‌లోని డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆర్జేడీ మాట్లాడారు. బడి బయట ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. మనబడి నాడు–నేడు పనుల్లో భాగంగా పాఠశాలలకు అవసరమైన అదనపు తరగతి గదులు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ నెలాఖరులోగా పరిష్కరించుకోవాలని చెప్పారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ పూర్తయిందని, విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ విద్యలో భాగంగా అందించిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల్లో విద్యార్థులు రోజూ గంట సమయమైనా పాఠ్యాంశాలు నేర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఎఫ్ఏ1 పరీక్షల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించాలని, తద్వారా మిగిలిన విద్యార్థులు బాగా చదివేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి పుస్తకాల సేకరణ, నిర్వహణపై పలు సూచనలిచ్చారు. తదనంతరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట మార్కాపురం ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్‌లోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



గుంటూరు జీజీహెచ్‌లో అనూష మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్, తహసీల్దార్ సంజీవరావు

టంగుటూరు: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత యువతి ఎలుకల మందు తిని, తన ఇద్దరి చిన్నారులకు తినిపించగా ఎనిమిది నెలల పాప మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చికిత్స పొందుతున్న తల్లీకుమారుల్లో అనూష(27) ఆరోగ్య పరిస్థితి విషమించి గుంటూరు జీజీహెచ్‌లో మృతి చెందింది. బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు.. టంగుటూరు మండలంలోని కందులూరు గ్రామానికి చెందిన అంబటి అనీల్ ఏ పని చేయకుండా మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవ పడుతూ భార్యను తీవ్రంగా కొడుతుండేవాడు. జూలై 29న అనిల్ మద్యం సేవించి అనూషను తీవ్రంగా దుర్భాషలాడుతూ కొట్టడంతో మనస్థాపం చెంది ఎలుకల మందు తెచ్చుకొని తన ఇద్దరు చిన్నారులకు తినిపించి ఆమె కూడా తినింది. మరుసటి రోజు వాంతులు కావడంతో బంధువులు తొలుత ఒంగోలు జీజీహెచ్‌కు, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్షర(8 నెలలు) జూలై 30వ తేదీ సాయంత్రం మృతి చెందింది. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి తల్లి అనూష(27) తుది శ్వాస విడిచింది. కుమారుడు అఖిల్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో అనూష మృతుదేహాన్ని సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, తహసీల్దార్ సంజీవరావు, వీఆర్వో పరిశీలించి వివరాలు సేకరించారు.

భర్త మీద విరక్తితో భార్య, మనుమడు అదృశ్యం

● కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు



అదృశ్యమైన మహిళ, బాలుడుతో ఎస్సై నాయబ్ రసూల్, సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): అదృశ్యమైన మహిళ, బాలుడు కేసును గంటల వ్యవధిలో ఛేదించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ కథనం మేరకు.. ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు గ్రామానికి చెందిన బండారు ప్రభాకరరావు గురువారం ఉదయం ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్య బండారు అక్కమ్మ, ఐదేళ్ల మనుమడు దీవెన్ కుమార్ 2వతేదీ మధ్యాహ్నం నుంచి కనపడటం లేదని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించాడు. ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ పర్యవేక్షణలో మూడు బృందాలు.. అదృశ్యమైన మహిళ, బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారు హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని గురువారం సాయంత్రం వారిని క్షేమంగా పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసులు బండారు అక్కమ్మను విచారించగా పెద్ద కుమారుడికి ముగ్గురు మగ పిల్లలు సంతానం. వారిలో చివరి వాడైన ఐదేళ్ల దీవెన్‌కుమార్‌ను తమ వద్ద పెంచుతున్నామని చెప్పింది. అక్కమ్మ భర్త మద్యానికి అలవాటుపడి ఆమెను వేధిస్తుండేవాడు. భర్తపై విరక్తితో 2వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోతున్న సమయంలో మనవడు దీవెన్‌కుమార్ ఆమె వెంటపడ్డాడు. ఏడుస్తుండటంతో పిల్లవాడిని కూడా తీసుకొని హైదరాబాద్ వెళ్లింది. అనంతరం బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించి, అక్కమ్మకు ఆమె భర్తకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి గంటల వ్యవధిలోనే అక్కమ్మను, ఆమె మనవడు ఆచూకీ కనుగొని తీసుకుని వచ్చిన పోలీసులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న ఎస్పీకి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థికసాయం

● ఒకరోజు వేతనం అందించిన జిల్లాలోని హోంగార్డులు



రిటైర్డ్ హోంగార్డు మహబూబ్‌కు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: సుదీర్ఘ కాలంపాటు సేవలందించి రిటైరైన హోంగార్డుకు జిల్లాలో పనిచేస్తున్న తోటి హోంగార్డులంతా వారి ఒక్కరోజు వేతనాన్ని ఆర్థికసాయంగా అందజేసి స్ఫూర్తిగా నిలిచారు. మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో హోంగార్డుగా 18 ఏళ్ల పాటు పనిచేసిన షేక్ మహబూబ్ ఈ ఏడాది మార్చిలో ఉద్యోగ విరమణ పొందారు. వృద్ధాప్యంలో ఉన్న అతని కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులంతా వారి జీతంలో నుంచి ఒకరోజు వేతనాన్ని అందజేశారు. మొత్తం రూ.4,85,640 చెక్కును ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. కాసేపు మహబూబ్‌తో మాట్లాడిన ఎస్పీ.. అతని కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రతగా చూసుకోవాలని, విశ్రాంత జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీపీవో ఎం.సులోచన, ఆర్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమమే ప్రధానం

ఎస్పీ పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్ నిర్వహించారు. సమస్యలపై సిబ్బంది అందించిన అర్జీలను పరిశీలించి సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే ఫిర్యాదులు పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీపీవో ఎం.సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, స్పందన ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో గుర్తుతెలియని మృతదేహం



అద్దంకి రూరల్: మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో శుక్రవారం సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పరిసరాల్లో మద్యం సీసాలు ఉండటంతో మద్యం సేవించి దాహం తీర్చుకునేందుకు నదిలోకి వెళ్లి జారి పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు క్రీమ్ కలర్ షర్టు, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి పూర్తి వివరాలు, మృతికి గలకారణాలు తెలియాల్సి ఉంది.

అసభ్యంగా ప్రవర్తించడంపై కేసు నమోదు

దర్శి: తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని గుంటూరి అశోక్ అనే యువకుడిపై ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్శి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఎర్రోబనపల్లె గ్రామానికి చెందిన అశోక్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా చేయిపట్టుకున్నాడని బాలిక ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసహజ లైంగిక చర్య, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు టౌన్: స్నేహితుడిపై అసహజ లైంగిక చర్యకు పాల్పడటమే కాకుండా హత్యకు పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా జరుగుమల్లి గ్రామానికి చెందిన కొమరగిరి శ్రీనివాసరావు (28), బోయలపల్లి నరసింహారావు (35) ఇద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలిసి తిరుగుతూ ఉండేవాళ్లు. అయితే శ్రీనివాసరావుకు పురుషులతో కలిసి శృంగారం జరిపే అలవాటు ఉండేది. 2009 డిసెంబరు 3వ తేదీ ఇంట్లో ఒంటరిగా వున్న నరసింహారావును గ్రామానికి సమీపంలోని చిన్న వెంకట సుబ్బారెడ్డి సపోట తోటలోకి తీసుకెళ్లి బ్రాందీలో మత్తు మందు కలిపి తాగించి అసహజ శృంగారానికి పాల్పడ్డాడు. తీవ్రంగా రక్త స్రావం కావడంతో ఊపిరాడక నరసింహారావు మరణించాడు. కేసు నమోదు చేసిన అప్పటి సీఐలు నిమ్మగడ్డ రామారావు, బాల మురళీకృష్ణలు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అనంతరం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. శ్రీనివాసమూర్తి ద్వారా కోర్టులో సాక్షులను హాజరుపరిచారు. ఎస్పీ మలికా గర్గ్ మార్గదర్శకంలో సమర్థవంతంగా ట్రయల్ రన్ నడిపి సరైనా సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేయడంతో శుక్రవారం ఒంగోలు అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టి.రాజా వెంకటాద్రి నిందితుడికి జీవిత ఖైదుతో పాటుగా రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి సింగరాయకొండ సీఐ నిమ్మగడ్డ రామారావు, బాల మురళీకృష్ణ, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఏ.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ జి.అనిల్ కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

పొదిలి రూరల్: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పొదిలి మండలం యేలూరు పంచాయతీలోని నల్లారెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి నాగయ్యకు ఆరుగురు సంతానం కాగా, అందరూ కలిసే ఉంటున్నారు. వారిలో అందరికంటే చివరివాడైన చినవెంకటరెడ్డికి ఉమ్మడి కుటుంబంలోని ఆస్తి పంపకాలలో అన్యాయం జరిగిందనే విషయంపై భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన చినవెంకటరెడ్డి భార్య అనూష (27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో పాకల రైల్వే గేటు సమీపంలో ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉంది. శుక్రవారం రైలు కింద పడి మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై సిమెంటు రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కా ఉన్నాయి. చొక్కా కాలర్‌పైన సీఆర్ఎల్ అని ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయి. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఒంగోలు జీఆర్‌పీ ఎస్సై వెంకటేశ్వర్లు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ MPHW (F) - ANM (2 Yrs) రెగ్యులర్ నర్స్ ట్రైనింగ్ & DMLT కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ ఎనీగ్రూప్, SC, ST, BC, OBC లకు స్కాలర్ షిప్ & హాస్టల్ వసతి కలదు. సంప్ర॥ ఝాన్సీ నర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఒంగోలు. ✆ 94402 74196 [OA-31]

COACHING

■ JEE / NEET / EAMCET / INTER Chemistry Subject నందు ప్రత్యేక శిక్షణ కొరకు సంప్రదించండి. K.R. Sir - ఒంగోలు. ✆ 96668 78753 [O-191561]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1902]

Real Estate

PLOT FOR SALE

■ OMC లిమిట్స్‌కు 4KM దూరంలో విజయవాడ హైవే నందు ఇప్పటికిప్పుడు, ఇల్లు నిర్మించుటకు అనువైన మా DTCP వెంచర్ నందు Openప్లాట్స్ కలవు. సంప్ర॥ ✆ 94940 40187 [OA-60]

TO LET

■ ఒంగోలు టౌన్, కర్నూల్‌రోడ్, మారుతీ నగర్ 1వలైన్, సుందరయ్య బంకు వద్ద 2పోర్షన్లబిల్డింగ్‌ఆఫీస్/రెసిడెన్స్‌లకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥✆9247899965 [O-191559]

WANTED

■ ఒంగోలు టౌన్ నెల్లూరు బస్టాండ్ మరియు ఆర్టీసి బస్టాండ్ మెయిన్‌రోడ్‌కి దగ్గరగా 14అడుగుల ఫేసింగ్ లో 11గదుల సెమి కమర్షియల్ స్థలం కావలెను. నో బ్రోకర్స్. email: doctorhomeo123@gmail.com [G-786474]

Services

BUSINESS OFFER

■ సూరత్‌లోదొరికేధరలకే ఇప్పుడు మన ఒంగోలు లోRs.300/-నుండి డైలీవేర్, ఫ్యాన్సీవేర్ చీరలు, Rs.700/-నుండి పట్టు చీరలు లభించును. వివరాలకు SBMC-1063 ✆ 9885149490 [O-191564]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం॥ ✆ 99121 05656. [O-191557]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2408]

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338 [B-382]

Wanted

■ ఒంగోలు సమతానగర్‌లోని శ్రీ గాయత్రి గ్రామర్ స్కూల్ నందు 6th to 8th వరకు బోధించుటకు ఫిజిక్స్ టీచర్ కావలెను. సంప్ర॥ ✆ 9014404155 [OA-58]

■ మేదరమెట్లలోని ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు హెల్పర్స్, సర్వర్స్ (వెయిటర్స్) వెంటనే కావలెను. ఫుడ్, రూమ్ ఇవ్వబడును. జీ॥ 15000/- అనుభవం గల వారికి ప్రాధాన్యత. ✆ 80960 30833 [O-191562]

■ సింగరాయకొండ శ్రీచైతన్య స్కూల్ నందు పనిచేయుటకు జంట్స్ వార్డెన్లు మరియు ఆఫీస్ క్లర్క్ కావలెను. వసతి సదుపాయం కలదు. ✆ 96667 04201. [O-759026]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221503]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786476]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9676414393. [M-1221480]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-473]

■ Wanted Primary Teachers For 1 To 5th Classes In Deepsika Public School(EM), Kakarla (Vi), Marri Pudi (Md), Prakasam (Dt) Hostel Facility Available Contact ✆ 80746 38228, 89789 35396. [O-759025]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02856 90102 02762